క్లుప్తంగా

మసీదుల వద్ద పటిష్ట బందోబస్తు



గూడూరు పట్టణంలోని జామియా మసీదు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు రూరల్ : బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఎక్కడా గోవధ జరగకుండా చూసేందుకు పోలీసులు ఆయా మసీదుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. పలుచోట్ల గోవధ చేస్తారనే సమాచారంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గట్టి చర్యలు చేపట్టినట్టు పట్టణ సీఐలు తెలిపారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలోని అన్ని మసీదుల వద్దా బందోబస్తు చేపట్టారు. మూడు రోజులుగా అక్రమంగా గోవులను రవాణా చేస్తారనే హెచ్చరికల నేపథ్యంలో చిల్లకూరు మండలం బూదనం టోల్ ప్లాజా వద్ద రెండు బృందాలు ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపుతున్నారు.

ఆరాధన మందిరంలో ఉజ్జీవ కూడికలు



దైవసందేశాన్ని వినిపిస్తున్న సుధాకర్‌బాబు

కోట: స్థానిక ఎన్‌సీఆర్ నగర్‌లోని బెరాకా ఆరాధన మందిరంలో మూడురోజులుగా 28వ వార్షిక ఉజ్జీవ కూడికలు జరుగుతున్నాయి. విజయవాడకు చెందిన బ్రదర్ సుధాకర్‌బాబు సోమవారం దైవ సందేశాన్ని వినిపించారు. బైబిల్ బోధనలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. క్రైస్తవులు సమాజంలో సోదరభావంతో మెలగాలన్నారు. ఉజ్జీవ కూడికలు నిర్వహిస్తున్న సేవకులను అభినందించారు. అనంతరం స్తుతికూడిక, బైబిల్ స్టడీ, ప్రార్థనా గీతాలు ఆలపించారు. సంఘకాపరి నోవాబాబు పాల్గొన్నారు.

కండలేరులో 6.429 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.429 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న పండరి భజన



భజన చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని మైక్రోవేవ్ స్టేషన్ కాలనీలోని గ్రామదేవత గంగమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం భక్తులు చేసిన పండరి భజన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కాలనీవాసులు పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నృసింహుని సేవలో మంత్రి ఆనం



పెంచలకోనలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఆనం, కురుగొండ్ల

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, ఆంజనేయస్వామి ఆలయాలను సోమవారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు డీసీ సాగర్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వచనం అందించారు. ఆయన వెంట వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ ఉన్నారు.

పెద్దశేషుడిపై ప్రసన్నుడి వైభవం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 6.55 నుంచి 7.25 వరకు మిథున లగ్నంలో వైఖానస ఆగమోక్తంగా ధ్వజారోహణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు కంకణభట్టార్, సూర్యకుమారాచార్యులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ



నాయుడుపేట టౌన్ : బక్రీద్ పండుగ ప్రత్యేక నమాజులో దువా చదువుతున్న మౌలానా అబూబకర్



గూడూరు పట్టణంలో నమాజు చేస్తున్న ముస్లిం సోదరులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జామీయా మసీదు సమీపంలోని షాదీమంజిల్ ఈద్గా వద్దకు ముస్లింలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈదుల్ జుహా ప్రత్యేక నమాజు చేశారు. జామీయా మసీదు మౌలానా అబూబకర్ మాట్లాడుతూ అందరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మనం చేసే సేవా కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఇతరులకు చేయూతను అందించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పురస్కరించుకుని నిర్వహించే ఖుర్బానీ ప్రాముఖ్యతను వివరించారు. ఖుర్బానీ చేసే వారు సోమవారం నుంచి మూడు రోజులు ఎప్పుడైనా జరుపుకోవచ్చన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా పట్టణంలోని పెద్ద దర్గా ఆవరణలో అమీర్‌షావలి మసీదులో మౌలానా అష్రాఫ్అలీ అధ్వర్యంలో, పాత బస్టాండు సమీపంలోని నూర్ మసీదు వద్ద అక్కడి హాఫీజ్, అమరాగార్డెన్ వద్ద ఉన్న మక్కా మసీదు తదితర చోట్ల మసీదుల్లో నమాజు చేశారు. ప్రార్థనల అనంతరం అనేక మంది ముస్లింలు ఖుర్బాని చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా చేసి పేదలు, బంధువులు, స్నేహితులకు పంచిపేట్టారు. అనేక మంది శ్మశానవాటిక వద్దకు వెళ్లి పెద్దలను స్మరించుకుని దువా చేశారు.

ఓజిలిలో...

ఓజిలి: మండలంలోని కురుగొండ, ఓజిలి, రాచపాళెం, భట్లకనుపూరు, నెమళ్లపూడి తదితర గ్రామా ల్లోని మసీదుల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం పలువురు వృద్ధులు, పేదలకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని ముస్లింలు సోమవారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధల నడుమ సోమవారం జరుపుకున్నారు. మజీద్‌లతో పాటు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని జామియా మసీదులో మూడు పర్యాయాలు నమాజు చేశారు. అనంతరం ఖుర్బానీ చేయించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను తెలిపారు. ఆకలిగొన్న వారికి భోజనం పెడితే అది అల్లాకు చెందుతుందని, అందుకే బక్రీద్ రోజున ఖుర్బానీ చేస్తారని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

చిల్లకూరులో..

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ, వరగలి, మోమిడి, ఏరూరు, చింతవరం, ఉడతావారిపాళెం, తొణుకుమాల, నాంచారమ్మపేట, పారిచెర్లవారిపాళెం, కడివేడు, తిమ్మనగారిపాళెం గ్రామాల్లో ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం అందరికీ పొట్టేళ్ల మాంసం పంచిపెట్టారు.

కోటలో..

కోట : మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కోట జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శ్యాంసుందరపురం ఈద్గా వద్ద నమాజు చేశారు. విద్యానగర్, చిట్టేడు, గోవిందపల్లి, శ్యాంసుందరపురం, కొత్తపాళెంలో ఉన్న మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డీవీ సత్రం, వేణుంబాకం, కల్లూరు, గొల్లపాళెం తదితర గ్రామాల్లో ఉన్న మసీదుల్లో మత గురువులు బక్రీద్ గురించి వివరించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాపూరులో...

రాపూరు: మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రాపూరులోని పెద్ద మసీదు వద్ద నుంచి ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. పేదలకు దానం చేశారు.



సూళ్లూరుపేట రూరల్: మన్నారుపోలూరు ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



వాకాడు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సూళ్లూరుపేట రూరల్‌లో...

సూళ్లూరుపేట రూరల్ : త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని అక్బరియా మసీదు ఇమామ్ షబ్బీర్ మజీద్ తెలిపారు. సూళ్లూరుపేట మండలంలో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మన్నారుపోలూరులోని ఈద్గా వద్ద ఈదుల్ అజ్‌హా ప్రార్థనలు చేశారు. ఇమామ్ షబ్బీర్ మజీద్ మాట్లాడుతూ శాంతికి చిహ్నమే బక్రీద్ పండుగన్నారు. ఖుర్బానీ ఇచ్చి నిరుపేదలకు పంచి పెట్టాలని సూచించారు. పేదల ఆకలి తీర్చే వ్యక్తికి ప్రత్యేక పుణ్యఫలాలు లభిస్తాయని తెలిపారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వాకాడులో..

వాకాడు : మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వాకాడు ఈద్గాలో ముస్లిం మత పెద్దలు సామూహిక ప్రార్థనలు చేశారు. బక్రీద్ విశిష్టతను వివరించారు. పేదలకు దానం చేశారు.

సైదాపురంలో..

సైదాపురం : సైదాపురం, ఊటుకూరు, కలిచేడు, గిద్దలూరు, చాగనం, మర్లపూడి గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పేదలకు దానం చేశారు.



రాపూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాపూరులో ఈద్గాకు ర్యాలీగా వెళుతున్న ముస్లింలు



దొరవారిసత్రం : వేణుంబాకంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఓజిలిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

క్రీడాకారుడికి సన్మానం

నాయుడుపేట టౌన్ : నియోజకవర్గానికి చెందిన అంతర్జాతీయ స్థాయి ఆర్చరీ క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నంను సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఘనంగా సన్మానించారు. ఆమెను క్రీడాకారుడు గణేష్ నాయుడుపేట పట్టణంలోని నెలవల సుబ్రమణ్యం నివాసం వద్ద ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పోటీల్లో భారతదేశం తరఫున ఆడి బంగారు పతకం సాధించాలని సూచించారు. ఇప్పటికే గణేష్ మణిరత్నం ఆర్చరీ పోటీల్లో బంగారు, రజిత పతకాలను సాధించడంపై అభినందించారు. ఇటీవల దక్షిణ కొరియా దేశంలో జరిగిన అంతర్జాతీయ ఆర్చరీ -2024-ఆసియా కప్ పోటీల్లో పురుషుల విభాగంలో ఆడి కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు.



ఆర్చరీ క్రీడకారుడు గణేష్ మణిరత్నం సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

విద్యార్థినికి నగదు బహుమతి

కలువాయి: పదవ తరగతి పరీక్షల్లో 572 మార్కులు సాధించిన చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ తాసిఫాకు గ్రామానికి చెందిన మదమంచి కిశోర్ రూ.20 వేలు నగదు బహుమతి అందజేశారు. సోమవారం సాయంత్రం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించి గ్రామ సర్పంచ్ జి.పెంచలయ్య, హెచ్ఎం జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో నగదు అందజేశారు. అనంతరం కిశోర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు

సైదాపురం: వెంకటగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను సైదాపురం మండల నేతలు కలిసి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త గుంటమడుగు కృష్ణమరాజు, మండల పార్టీ అధ్యక్షుడు మోహన్‌కృష్ణారెడ్డి, సినియర్ నాయకుడు సుబ్రమణ్యంరాజు, దిలీప్‌చౌదరి, కేపీరాజు, కిరణ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను అభినందిస్తున్న నేతలు

ఈద్గాకు స్థలం కేటాయింపునకు కృషి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో ముస్లింలు ఒకే చోట సామూహికంగా నమాజు చేసుకునేందుకు వీలుగా స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం నాయకులతో కలిసి జామియా మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయనను ముస్లిం మత పెద్దలు సన్మానించారు. నాయుడుపేటలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అమీర్‌షావలి గంధోత్సవాన్ని వివాదాలతో ఏడేళ్లకు పైగా నిలిపేశారని, ఇరువర్గాలతో మాట్లాడి వచ్చే ఏడాది ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నేతలను సన్మానిస్తున్న నెలవల సుబ్రమణ్యం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో సోమవారం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించారు. గ్రామంలోని యువకులు, మహిళలు ఒకరినొకరు వసంతాల నీటిని పోసుకున్నారు. పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

సద్గుణాలను అలవరుచుకోవాలి



ప్రవచనం చేస్తున్న చినజీయర్ స్వామి

– ఆధ్యాత్మిక గురువు త్రిదండి చిన్నజీయర్ స్వామిజీ

నాయుడుపేట టౌన్ : ప్రాణం లేని చెట్టు కూడా పరోకారం చేస్తుందని, అలాగే ప్రాణమున్న మనుషులు ఇతరులకు సహాయపడే సద్గుగుణాలను అలవరుచుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, పద్మ భూషణ్ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తెలిపారు. ఆయన చెన్నై నుంచి సోమశిల వెళుతూ నాయుడుపేటలోని అగ్రహారపేటలో ఉన్న మారంరెడ్డి అమర్‌నాథరెడ్డి, బృందావని దంపతుల నివాసానికి చేరుకున్నారు. ఆదివారం రాత్రి అక్కడే బసచేశారు. సోమవారం ఉదయం పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ప్రతి ఒక్కరూ పేదలకు సాయం చేయాలన్నారు. నేటి సమాజంలో పిల్లలకు చిన్నతనం నుంచి విలువలతో కూడిన విద్యను అందించే విధంగా తల్లిదండ్రులు కృషిచేయాలన్నారు. సామాజిక విజ్ఞానం లేని చదువు దండగన్నారు. తమ రామానుజం పీఠం ద్వారా ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడంతోపాటు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. విద్యకు ప్రాముఖ్యత ఇస్తు ప్రజ్ఞావికాస్, విజ్ఞానం పెంపొందించేలా సంస్కర్ వికాస్ వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఆయన సోమశిలకు వెళ్లారు. ఆయనకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ శ్యామసుందరరెడ్డి, కనుపూరు ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ సిద్ధారెడ్డి, గ్రామ దేవత పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, కట్టా సురేఖరెడ్డి, ఆర్య వైశ్య సంఘం రూరల్ జిల్లా అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఈదా రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక ప్రయోజనాలు

- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం
- ఒకే పంటతో చీడపీడల ఉధృతి అధికం
- పంట మార్పిడితో భూమిలో సేంద్రియ పదార్థాల వృద్ధి



పిచ్చాటూరు మండలం రజానగరంలో పొలం దున్నుతున్న రైతు

పిచ్చాటూరు : ఏటా ఒకే పంట సాగు చేస్తే రైతులకు పెట్టుబడులు పెరుగుతాయి. అంతేగాక పంటపై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. దిగుబడులు తగ్గుతాయి. ఏటా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకేరకం పంటను ఏళ్ల తరబడి సాగు చేయడం వల్ల పంటల ఎదుగుదల తగ్గుతుందని, చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు. అందుకే పంటమార్పిడి చేయాలని వివరిస్తున్నారు. పొలంలో ఒకే రకం కాకుండా వేర్వేరు పంటలను సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చన్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకత, ప్రయోజనాలను వివరిస్తున్నారు.

ఒకే తరహా పంటలతో నష్టాలు

- ఏటా ఒకే తరహా పంట సాగుచేయడం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయి. కలుపు బెడద అధికంగా ఉంటుంది. సాగుచేసిన పైరు కూడా ఎదుగుదల ఉండదు. తద్వారా దిగుబడులు తగ్గుతాయి. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరిగి నష్టం వాటిల్లుతుంది.
- ఒకే పంట సాగుతో వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేలకోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యత ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వస్తుంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగుచేసుకోవాలి.
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లను ఒకదాని తరువాత ఒకటి సాగుచేయాలి. ఉదాహరణకు జొన్న, పత్తి.
- భూసారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తరువాత ఒకటి సాగు చేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

- వరిపంట సాగుచేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుంది. అంతేగాక సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా చేరుతుంది. దీంతో పైరు ఏపుగా పెరుగుతుంది.
- వరి తరువాత అపరాలు లాంటి పైర్లు సాగుచేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం అధికమౌతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉధృతి తగ్గుతుంది.
- వరి తరువాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగుచేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

మంచి దిగుబడులకు అవకాశం



పంట మార్పిడి వల్ల రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు. ప్రస్తుతం రైతులు అధిక శాతం తమ పొలాల్లో ఏటా ఒకేరకం పంట సాగుచేస్తున్నారు. నీటి పారుదల కింద వరి తప్ప ఇతర పంటలు సాగుచేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమమైంది. రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి అమలు చేయాలి. –సంజీవ రెడ్డి, ఏవో, పిచ్చాటూరు

సైదాపురంలో మోస్తరు వర్షం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో సోమవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు వీసి 2 గంటల నుంచి 4 వరకు మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం నిమ్మకు ఎంతో అనుకూలంటా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎండతో ఇబ్బంది ప్రజలు వర్షంతో కొంత ఉపశమనం పొందారు.



సైదాపురంలో కురుస్తున్న వర్షం